

కౌంట్ డౌన్ ప్రారంభం

● ప్రచార యాత్రలో నయినార్ నాగేంద్రన్



మీనాక్షి అమ్మవారి ఆలయం వద్ద నాగేంద్రన్ తదితరులు

చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈరోజు నుంచి కౌంట్ డౌన్ ప్రారంభమైందని, ఎన్డీఏ కూటమి అధికా రం చేపట్టి, ఈపీఎస్ (ముఖ్యమంత్రి) అవుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. 'తమిళగం తలై నిమిర తమిళన్ పయనం' పేరుతో మదురై నుంచి ఆదివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించిన సందర్భంగా, నయినార్ నాగేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ... ఆదివారం నుంచి కౌంట్ డౌన్ ప్రారంభమైంది, ఎన్డీఏ కూటమి అధికారం చేపడుతుంది, ఈపీఎస్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు పెరుగుతుండడంతో ప్రజలు బాధలో ఉన్నారని అన్నారు. పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపినందుకు వారు శిక్షించబడుతున్నారన్నారు. న్యాయస్థానాలు ప్రశ్నించే షేకైన ప్రభుత్వం డీఎంకేదేనన్నారు. కరూర్‌లో 41 మంది మృతిచెందారు, ఈ ఘటన ఎలా జరిగింది? ఇది ప్రభుత్వం, పోలీసులు తప్పు అని అన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ హోం శాఖను తన చేతుల్లో ఉంచుకున్నారని, కానీ ప్రతిరోజూ రాష్ట్రంలో మారణహోమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రోడ్డు ప్రమాదంలో ఎవరైన మృతి చెందితే రూ.2 లక్షలు ఇస్తుండగా, ఈ పాలనలో మద్యం తాగి ఎవరైనా మరణిస్తే రూ.10 లక్షలు పరిహారం అందజేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల భయాందోళనలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఎన్డీఏ కూటమి త్వరలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తుందని, ఈపీఎస్ మా నాయకుడిగా వస్తారని నయినార్ నాగేంద్రన్ తెలిపారు. తొలుత నయినార్ నాగేంద్రన్ మీనాక్షి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ఆలయాల అభివృద్ధికి 'బంగారం' పథకం

● బ్యాంకుల్లో పెట్టుబడి పథకం ద్వారా ఏడాదికి రూ.17.76 కోట్ల వడ్డీ

● దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు



నగలను బ్యాంక్ ఆర్ఎంకు అప్పగిస్తున్న మంత్రి శేఖర్‌బాబు తదితరులు

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో బంగారం పెట్టుబడి ద్వారా ఏడాదికి రూ.17.76 కోట్ల వడ్డీ వస్తోందని, దాని ద్వారా ఆలయాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. కాంచీపురంలోని కంచి కామాక్షి ఆలయం, కుంద్రత్తూర్ సుబ్రమణ్యస్వామి ఆలయం, తిరువిడందై నిత్యకల్యాణ పెరుమాళ్ ఆల యం, తిరుమలైవయావూరు ప్రసన్న వెంకటేశ్వర పెరుమాళ్ ఆలయాల నుంచి 53.386 కిలోల బంగారు నగలను కరిగించి బంగారం పెట్టుబడి పథకంలో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కంచి కామాక్షి అమ్మవారి ఆలయ నవరాత్రి మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి శేఖర్‌బాబు ఈ బంగారాన్ని స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సెంథిల్ నాథన్‌కు అప్పగించారు. అనంతరం వెయ్యేళ్ల ప్రాచీన ఆలయాల్లో ఒకటైన కాంచీపురం ఏకాంబరనాథ్ ఆలయంలో రూ.29 కోట్లతో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శేఖర్ బాబు విలేఖరులతో మాట్లాడుతూ.. ఆగమ శాస్త్రం ప్రకారం, 12 ఏళ్లకు ఒకసారి మహాకుంభాభిషేకం జరిగే ఆలయాలను గుర్తించి, ఇప్పటివరకు 3,707 ఆలయాల్లో మహాకుంభాభిషేకం నిర్వహించామన్నారు. శిథిలావస్థలకు చేరిన ఆలయాలను పునరుద్ధరించేందుకు రూ.425 కోట్ల మేర సీఎం స్టాలిన్ కేటాయించారన్నారు. ప్రభుత్వ నిధులు, ఆలయ నిధులు, దాతల విరాళాల ద్వారా ఇప్పటివరకు వెయ్యేళ్ల ప్రాచీనమైన 68 ఆలయాలను పునరుద్ధరించి కుంభాభిషేకం జరిపామని మంత్రి తెలిపారు. బంగారం పెట్టుబడుల పథకంలో 21 దేవాలయాల బంగారు నాణేలను కరిగించి 1,075 కిలోల 123 గ్రాముల 488 మి.గ్రా బంగారు కడ్డీలను స్టేట్ బ్యాంక్‌లో ఆయా ఆలయాల పేరిట డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా ఏడాదికి రూ.17 కోట్ల 76 లక్షల 85 వేలు వడ్డీ రూపంలో వస్తుందని, ఈ నిధులను ఆయా ఆలయాల అభివృద్ధికి వినియోగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్, ఎంపీ కె.సెల్వం, ఎమ్మెల్యేలు కె.సుందర్, ఎళిలరసన్, కాంచీపురం మేయర్ మహాలక్ష్మి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 8న ఏకాంబరనాథాలయ మహాకుంభాభిషేకం

ప్యారీస్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో ఎళవార్‌కుళలి అమ్మవారి సమేత ఏకాంబరనాథ ఆలయ మహాకుంభాభిషేకం డిసెంబర్ 8న నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ మంత్రి పీకే.శేఖర్‌బాబు పేర్కొన్నారు. 17యేళ్ల అనంతరం మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతించిందని, ఆయన ఆదివారం వెల్లడించారు..

రోజురోజుకు పెరుగుతున్న 'డెంగ్యూ'కేసులు

● ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు



స్టాన్లీ ఆస్పత్రిలో పత్యేక వార్డు

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోజురోజుకు డెంగ్యూ కేసులు పెరిగిపోతుండడంతో బాధితులకు చికిత్స అందించేందుకు ఆస్పత్రుల్లో ప్రత్యేక చర్యలు చేపట్టారు. చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్ జిల్లాల్లో డెంగ్యూ వ్యాప్తి అధికంగా ఉంది. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగ్యూ లక్షణాలతో చికిత్స పొందుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా, జ్వరం, తలనొప్పి, వికారం, వాంతులు తదితర డెంగ్యూ లక్షణాలతో ప్రతిరోజూ 20 మందికి పైగా చికిత్స కోసం వస్తున్నారు. వారికి ప్రత్యేకంగా చికిత్స అందించేలా, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటయ్యాయి. స్టాన్లీ, కీల్పాక్కం, రాయపేట తదితర ప్రభుత్వాసుపత్రుల్లో దోమతెరలతో కూడిన పడకలు ఏర్పాటుచేశారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... స్టాన్లీ ఆసుపత్రిలో 8 మంది, రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రుల్లో ఇద్దరు డెంగ్యూ లక్షణాలతో చికిత్సలు పొందుతున్నారని, సత్వరం చికిత్సలు అందిస్తే డెంగ్యూ జ్వరంతో ప్రాణహాని నిరోధించవచ్చని వైద్యులు తెలిపారు.

అదనపు ఛార్జీ వసూలు చేస్తే చర్యలు

● ఆమ్నీ బస్సులకు మంత్రి శివశంకర్ హెచ్చరిక



మాట్లాడుతున్న మంత్రి శివశంకర్

ప్యారీస్, అక్టోబర్ 12 (ఆంధ్రజ్యోతి): పండుగ రద్దీని ఆసరాగా తీసుకుని ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలుంటాయని రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్.శివశంకర్ ఆమ్నీ బస్సుల యజమానులను హెచ్చరించారు. ఈ నెల 20న దీపావళి పండుగను సొంతూళ్లలో జరుపుకునేందుకు పలు ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు తమ ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే రైళ్లు, బస్సుల్లో టికెట్ల రిజర్వేషన్ ముగిసింది. దీంతొ ప్రజలు ఆమ్నీ బస్సులను ఆశ్రయించి వారు డిమాండ్ చేసిన ధరకు టికెట్లు రిజర్వు చేసుకుంటున్నారు. గత ఏడాది కంటే ఈ దీపావళికి ఆమ్నీ బస్సుల్లో టికెట్ల ధర నాలుగింతలు పెంచారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, మంత్రి శివశంకర్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. దీపావళి, పొంగల్, క్రిస్మస్ తదితర పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీని ఆసరాగా తీసుకుని అదనపు ఛార్జీ వసూలు చేసిన ఆమ్నీ బస్సుల లైసెన్స్ రద్దు చేస్తూ గతంలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బస్సు ఛార్జీల వసూళ్లను పర్యవేక్షించేందుకు రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలు చెన్నై, కోవై, మదురై, తిరుచ్చి, సేలం, తిరునల్వేలి తదితర ప్రాంతాలకు వెళ్లి ఆమ్నీ బస్సుల్లో తనిఖీలు నిర్వహిస్తారని మంత్రి తెలిపారు.

17న కరూర్‌కు విజయ్?

● మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

● తొక్కిసలాటపై సాగుతున్న విచారణ

● సీబీఐ దర్యాప్తుపై నేడు సుప్రీం కోర్టు నిర్ణయం



చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ఈ నెల 17న కరూర్ పర్యటనకు వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయి. కరూర్ జిల్లా ఎస్పీ అనుమతిస్తే ఆయన తొక్కిసలాట మృతుల కుటుంబాలను పరామర్శించడంతో పాటు ఆర్థిక సాయం కూడా అందించాలని భావిస్తున్నారు. సెప్టెంబరు 27వ తేదీన విజయ్ కరూర్‌లో జరిపిన ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటో 41 మంది ప్రాణాలు కోల్పోగా వంద మందికిపైగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు అన్ని రాజకీయ పార్టీల నేతలు తమ ప్రగాఢ సంతాపం సానుభూతి తెలిపారు. అలాగే, తమ పార్టీ తరపున విజయ్ ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇదిలావుండగా ఈ నెల 3, 4వ తేదీల్లో స్థానిక నేతలు కుటుంబాలను పరామర్శించారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు కరూర్ వెళ్లేందుకు అనుమతివ్వాలని విజయ్ డీజీపీ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. అయితే, కరూర్ ఎస్పీని సంప్రదించి టూర్ షెడ్యూల్ వివరాలు స్పష్టంగా వివరించి అనుమతి పొందాలని డీజీపీ కార్యాలయం సూచించింది. దీంతో శనివారం ఆ జిల్లాకు చెందిన టీవీకే నేతలు జిల్లా ఎస్పీని కలిసి ఈ నెల 17న విజయ్ పర్యటనకు అనుమతివ్వాలని కోరారు. అయితే, జిల్లా ఎస్పీ నుంచి ఇప్పటివరకు అనుమతి రాలేదు. దీంతో సోమవారం కూడా మరోమారు జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేయాలని టీవీకే నేతలు భావిస్తున్నారు. అంతేగాక విజయ్ పర్యటనకు సంబంధించి అట్లాస్ ఆడిటోరియంను ఎంపిక చేసినట్టు సమాచారం. ఈ ఆడిటోరియానికి కరూర్ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మృతులు, క్షతగాత్రుల కుటుంబ సభ్యులను మాత్రమే అనుమతించనున్నారు. అలాగే, ఈ కార్యక్రమం జరిగే ఆడిటోరియం వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని టీవీకే నేతలు సమర్పించిన వినతి పత్రంలో కోరారు.

విజయ్ అనుచరుడి విచారణ

ఈ తొక్కిసలాట ఘటనకు సంబంధించి విజయ్‌కు ప్రధాన అనుచరుడైన సేలం (సెంట్రల్) జిల్లా కార్యదర్శి పార్తిబన్ వద్ద ప్రత్యేక దర్యాప్తు ఆదివారం విచారణ జరిపింది. ముందుగా అందిన సమన్లతో ఆయన ఆదివారం నలుగురు విచారణ అధికారుల ఎదుట హాజరయ్యారు. ఆ తర్వాత సౌండ్ ఇంజనీర్, జనరేటర్ ఆపరేటర్లను కూడా విచారణ జరిపారు. వీరితో పాటు అటవీ, ప్రజాపనులు, రహదారులు, రవాణా శాఖ అధికారుల వద్ద కూడా దర్యాప్తు అధికారులు విచారణ జరిపారు.

సీబీఐ విచాణపై నేడు సుప్రీంకోర్టు తీర్పు

కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం తీర్పు చెప్పనుంది.. సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన ఐదు పిటిషన్లపై శుక్రవారం విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. తీర్పును వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఆ తీర్పును సోమవారం వెలువరించనుంది. దీంతో సుప్రీంకోర్టు నిర్ణయం ఎలా వుంటుందోన్న ఉత్కంఠ రాజకీయవర్గాల్లో నెలకొంది.

పుదువైకు తుఫాన్ల గండం!

పుదుచ్చేరి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరికి మూడు తుఫాన్ల గండం పొంచివుందని ఆ రాష్ట్ర ప్రాంతీయ వాతావరణ కేంద్ర అధికారి బాలమురుగన్ వెల్లడించారు. ఈ విషయంపై ఆయన ఆదివారం మాట్లాడుతూ, పుదుచ్చేరిలో యేడాదిలో సగటున 1,330 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు. నైరుతి సీజన్ కంటే ఈశాన్య రుతుపవన సీజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదవుతుందన్నారు. ప్రస్తుత సంవత్సరంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైందన్నారు. ఈ సీజన్‌లో మొత్తం 575.3 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఇది సాధారణం కంటే 173.4 మి.మీ అధికమన్నారు. ఈ యేడాది ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైతే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఈ నెల మూడో వారంలో పుదుచ్చేరిలో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయన్నారు. అలాగే, రెండు నుంచి మూడు తుఫానులు రాష్ట్రాన్ని తాకొచ్చని ఆయన వెల్లడించారు.

48 గంటల్లో మోస్తరు వర్షాలు

అడయార్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న 48 గంటల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ తమిళనాడు తీర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని తెలిపింది. ఈ ప్రభావంతో, సోమవారం కోయంబత్తూర్, తిరుప్పూర్ జిల్లాలోని కొండ ప్రాంతాలు, నీలగిరి, ఈరోడ్, తేని, మదురై, దిండుగల్, విరుదునగర్, ధర్మపురి, సేలం, నామక్కల్ తదితర 12 జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసే అవకాశముంది. ఈ నెల 13న కోయంబత్తూర్ జిల్లాలోని కొండ ప్రాంతాలు, నీలగిరి, తేని, తెన్‌కాశి జిల్లాల్లో ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీవర్షం కురిసే అవకాశముంది. చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన స్వల్ప వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

ఈపీఎస్‌కు రాజకీయాలు తెలియవు

● టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుంతగై

అడయార్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి దినపత్రికలు చదవరని, అందువల్ల ఆయనకు రాజకీయాలు తెలియవని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై వ్యాఖ్యానించారు. ఆదివారం సత్యమూర్తి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇతర రాజకీయ పార్టీలు లేదా రాజకీయ నేతల గురించి తాము అనాగరికంగా మాట్లాడబోమని, అయితే తమను మాత్రం రెచ్చగొడితే మాత్రం వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. రాష్ట్ర హక్కులను ఫణంగా పెట్టి బానిసగా ఉన్న వారికి తమ పార్టీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత రాజకీయాలు, ప్రభుత్వాలను చూశామన్నారు. కానీ ఇపుడు ఎడప్పాడి పళనిస్వామి మరింత దిగజారి మూడో రకం రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలు, సంక్షేమం విషయంలో ఏమాత్రం రాజీపడకుండా, డీఎంకే కూటమిలో భాగస్వామిగా ఉన్నప్పటికీ విద్యుత్ చార్జీలు, ఆస్తి పన్ను పెంపు వంటి అంశాలపై ఆందోళన చేశామని ఆయన గుర్తు చేశారు.

నాలుగో రోజుకు చేరిన ఎల్పీజీ ట్యాంకర్ల సమ్మె

● గ్యాస్ సరఫరాకు అంతరాయం లేదు: ఐఓసీ



అడయార్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల పరిష్కారం కోసం దక్షిణ ప్రాంతీయ ఎల్పీజీ గ్యాస్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన సమ్మె ఆదివారానికి నాలుగో రోజుకు చేరింది. ఈ సమ్మె పరిష్కారానికి చమురు సంస్థల ఉన్నతాధికారులతో ట్యాంకర్ల యజమానులు పలు దఫాలుగా జరిపిన చర్చలు ఫలించలేదు. దీంతో సోమవారం కూడా మరోమారు చర్చలు జరుగనున్నాయి. నామక్కల్ జిల్లా కేంద్రంగా సౌత్ జోన్ ఎల్పీజీ గ్యాస్ ట్యాంకర్ లారీ యజమానుల సంఘం ఈ నెల 9 నుంచి డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. చమురు కంపెనీలు మార్చిలో నిర్వహించిన టెండర్లలో పాలుపంచుకున్న 3500 లారీల్లో 700 గ్యాస్ ట్యాంకర్ల యజమానులకు అవకాశం కల్పించలేదు. దీనికితోడు పలు డిమాండ్లు అపరిష్కృతంగానే ఉన్నాయి. తమ డిమాండ్ల పరిష్కారంతో పాటు 700 లారీల యజమానులకు వర్క్ ఆర్డర్ ఇవ్వాలని కోరుతూ ఈ నెల 9 నుంచి సమ్మెకు దిగారు. ఈ సమస్య పరిష్కారం కోసం పలు దఫాలుగా చర్చలు జరిపినప్పటికీ ఫలించలేదు. ఈ విషయంపై గ్యాస్ ట్యాంకర్ల లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు సుందరరాజన్ స్పందిస్తూ, ప్రస్తుతం అమల్లో ఉన్న టెండర్ విధానాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని, 700 లారీలకు వర్క్ ఆర్డర్ ఇవ్వాలని ఇలా పలు అంశాలను చమురు కంపెనీల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్టు తెలిపారు. మరోవైపు ఈ సమ్మె వల్ల రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్పష్టం చేసింది.

కిటకిటలాడిన వీధులు ... కిక్కిరిసిన దుకాణాలు



రంగనాథన్ వీధిలో కొనుగోలుదారుల రద్దీ

ప్యారీస్, అక్టోబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దీపావళి పండుగను వచ్చే సోమవారం జరుపుకుంటున్న నేపథ్యంలో వస్త్ర, బంగారం షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. దీపావళి పండుగ మరో వారం రోజులే ఉండడంతో ప్రజలు పండుగకు అవసరమైన వస్తువులను కొనుగోలుచేసేందుకు మార్కెట్లు, సంతవీధులకు వెళ్తున్నారు. స్థానిక టి.నగర్ ప్రాంతం ఆదివారం కొనుగోలుదారులతో కళకళలాడింది. షాపింగ్‌కు వచ్చే ప్రజలకు రక్షణ కల్పించేలా గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ పోలీసు భద్రత పటిష్టం చేశారు. రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా వాచ్ టవర్ల ద్వారా పోలీసులు అనుక్షణం నిఘా వేస్తున్నారు. ప్యారీస్, ఈవెనింగ్ బజార్, ఫ్లవర్‌బజార్, షావుకారుపేట, వాషర్‌మెన్‌పేట, జీఏరోడ్డు, పురుషవాక్కం, డౌటన్, పెరంబూరు, మైలాపూర్, మూలక్కడై, మాధవరం, అడయార్, సైదాపేట, ఎగ్మూర్ తదితర ప్రాంతాలో వస్త్ర దుకాణాల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. కేంద్రప్రభుత్వ ం ఇటీవల జీఎస్టీ తగ్గించడంతో ధరలు స్వల్పంగా తగ్గుముఖం పడటంతో ప్రజలు పండుగ సామగ్రి కొనుగోళ్లపై ఉత్సాహం చూపుతున్నారు. పండుగను సంతోషంగా ప్రజలు జరుపుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భద్రత కట్టుదిట్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 48,000 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్ ప్రాంతాలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. కాగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న పశువుల సంతలో ఆదివారం రూ.కోట్లు విలువచేసే గొర్రెల అమ్మకాలు జరిగినట్లు వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

సమాచార దృష్టి

రేపు నాలుగు మండలాల్లో విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగు మండలాల్లో మంగళవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా... అన్నాసాలై సబ్ డివిజనల్ కార్యాలయం, అన్నా నగర్ డివిజన్ కార్యాలయం, గిండి మండలంలోని కేకే నగర్ సబ్ స్టేషన్, వెంబాక్కం మండలంలోని పొన్నేరి సబ్ స్టేషన్ ప్రాంగణంలో ఈ నెల 14వ తేది ఉదయం 11 గంటలకు గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఆయా మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఈ సమావేశంలో పాల్గొని విద్యుత్ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు విజ్ఞప్తి చేసింది.

వేళచ్చేరి కల్యాణ మండపం అద్దెకు సిద్ధం

చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్ నగర్ మండలంలో కల్యాణ మండపం అద్దెకు సిద్ధంగా ఉందని, ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు హౌసింగ్ బోర్డు, బీసెంట్ నగర్ మండలం వేళచ్చేరి నెహ్రూనగర్ కామరాజర్ వీధిలో 650 సీట్ల సామర్థ్యం, 250 మంది భుజించేలా డైనింగ్ హాలు, ఏసీతో కూడిన వధూవరుల గదులు, ఐదు గదులు, లిఫ్ట్ విశాలమైన పార్కింగ్‌తో కల్యాణ మండపం నిర్మించారని తెలిపింది. ఈ కల్యాణ మండపం అద్దెకు సిద్ధంగా ఉందని, ప్రజలు ఈ కల్యాణ మండపం వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్ ఫ్లో

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు నీటి రాక పెరిగింది. శనివారం డ్యాంకు 29,540 ఘనపుటడుగుల మేర నీరు వస్తుండగా, ఆదివారం ఉదయం 59,123 ఘనపుటడుగులకు పెరిగింది. ఆ ప్రకారం శుక్రవారం 111.48 అడుగులున్న నీటిమట్టం, రెండు రోజుల్లో 115.18 అడుగులకు చేరుకుంది. డెల్టా సాగుకు డ్యాం నుంచి 12,500 ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంకు అధికంగా నీరు వస్తుండడంతో మరో రెండు రోజుల్లో డ్యాం పూర్తిస్థాయి 120 అడుగులకు చేరుకొనే అవకాశముందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

15 నుంచి దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ఉంగళుడన్ స్టాలిన్' పథకంలో ఇక నుంచి దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. దివ్యాంగులు గుర్తింపు కార్డులు, డాక్టర్ సర్టిఫికెట్ తదితరాలకు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తుంటారు. అలా కార్యాలయాలకు వెళ్లి రావడంలో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై దృష్టి సారించిన ప్రభుత్వం, దివ్యాంగులకు ప్రతి బుధవారం ప్రత్యేక శిబిరం నిర్వహించి గుర్తింపు కార్డులు, డాక్టర్ సర్టిఫికెట్లు అందించనుంది. ఆ ప్రకారం స్టాన్లీ ఆస్పత్రిలో ఈ నెల 15 నుంచి ఈ శిబిరాలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

27న పోలీసు వాహనాల వేలం

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తాంబరం నగర పోలీసు శాఖ వినియోగించిన 8 ద్విచక్రవాహనాలను ఈ నెల 27వ తేది వేలం వేయనున్నారు. ఈ మేరకు తాంబరం నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... తాంబరం నగర పోలీసు శాఖకు చెందిన పుదువంజేరిలోని సాయుధ దళ మైదానంలో ఉదయం 10 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు, వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 24వ తేది ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల్లోపు రూ.1,000 డిపాజిట్‌తో పేరు నమోదుచేసుకోవాలన్నారు. వేలంలో వాహనాలు కొనుగోలు చేసేవారు, వేలం ముగిసిన వెంటనే 25 శాతం చెల్లించాలని, మరుసటిరోజు జీఎస్టీతో కలిపి మిగిలిన 75 శాతం చెల్లించాలని ప్రకటనలో తెలిపారు.

'హార్టికల్చర్' ఇన్‌స్టిట్యూట్‌లో అడ్మిషన్లు

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరంలోని హార్టికల్చర్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూటల్‌లో ఖాళీ సీటను భర్తీ చేయనున్నారు. ఈ విషయమై ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ చాందిని విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మాధవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ మేనేజ్‌మెంట్ కోర్సులో ఖాళీగా ఉన్న 11 సీట్లకు ఈ నెల 15,22 తేదీల్లో అడ్మిషన్ కల్పించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ రెండు రోజుల్లో మాధవరం పాల డిపో రోడ్డులోని ఇన్‌స్టిట్యూట్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కోర్సుల అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారు, కౌన్సెలింగ్‌లో సీటు పొంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకానివారు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసినా కళాశాలలో చేరని వారు కూడా పాల్గొనవచ్చు. తక్షణ ప్రవేశ సమయంలో సీటు పొందిన వారు రూ.5,000 అడ్మిషన్ ఫీజు చెల్లించి వెంటనే కళాశాలలో చేరవచ్చని, వివరాలకు 6385116971 అనే నెంబరు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఐదు నిమిషాల్లో '108' సేవలు

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) నగరంలో ఐదు నిమిషాల్లో '108' అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయని ఆరోగ్య శాఖ తెలిపింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ప్రాణాపాయంలో ఉన్న వారు, అత్యవసర చికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు తరలించేందుకు 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి. నగరంలో ప్రభుత్వాసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, తహసీల్దార్ సహా పలు ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో అంబులెన్స్‌లను పార్కింగ్ చేస్తున్నారు. అంబులెన్స్ కోసం కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిన వెంటనే, ఆ కేంద్రం నుంచి సంబంధిత ప్రాంతంలో ఉన్న అంబులెన్స్ ఉద్యోగులకు సమాచారం అందించి, ఘటన జరిగిన ప్రాంతానికి పంపిస్తున్నారు. ఈ విషయమై ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ... ప్రజలకు సత్వర సేవలు అందించేలా 108 అంబులెన్స్ సేవల్లో మార్పు చేశామన్నారు. ఆ ప్రకారం, రాజధాని నగరం చెన్నైలో ఐదు నిమిషాల్లోను, చెంగల్పట్టు, కడలూరుల్లో ఏడు నిమిషాలు, మిగిలిన జిల్లాల్లో 8 నిమిషాల్లో అంబులెన్స్‌లు సమాచారం అందిన ప్రాంతాలకు చేరుకుంటాయని తెలిపారు.

తండ్రి మృతదేహం సాక్షిగా తనయుడి వివాహం

● రౌడీ నాగేంద్రన్ ఇంటి విషాదంలో మరో ఘట్టం

ప్యారీస్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన రౌడీ నాగేంద్రన్ మృతదేహం సాక్షిగా ఆయన రెండో కుమారుడి వివాహం ఆదివారం కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య వినూత్నంగా జరిగింది. బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో ప్రధాన నిందితుడు, మూడు దశాబ్దాలుగా హత్యలు, హత్యాయత్నాలు, దాడుల కేసుల్లో జైలుకు వెళ్లివచ్చిన పేరుమోసిన రౌడీ నాగేంద్రన్ తీవ్ర అనారోగ్యంతో స్టాన్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మూడు రోజుల అనంతరం ఆదివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య నాగేంద్రన్ అంత్యక్రియలు జరిగాయి. అంజలి కోసం ఇంటి ముందుంచిన నాగేంద్రన్ మృతదేహం వద్ద ఆయన రెండో కుమారుడు అజిత్ తనకు ముందే నిశ్చయించిన షకీనా మెడలో తాళి కట్టి దండలు మార్చుకున్నారు. గత కొద్ది నెలలుగా పుళల్ జైలులో వున్న రౌడీ నాగేంద్రన్ కాలేయ సమస్య కారణంగా తీవ్ర అస్వస్థత చెందటంతో ఆగస్టులో పోలీసులు అతడిని చికిత్స కోసం స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యనిపుణులు అతడిని అత్యవసర చికిత్సా విభాగంలో చికిత్స అందించారు. గురువారం ఉదయం చికిత్స ఫలించక నాగేంద్రన్ మృతి చెందాడు. ఈనేపథ్యంలో తనభర్తకు విషమిచ్చి పోలీసులే హత్యచేశారని, మృతదేహానికి తన తరుపు వైద్యుల సమక్షంలో పోస్టమార్టం నిర్వహించేలా ఆదేశించాలని కోరుతూ నాగేంద్రన్ భార్య విశాలాక్షి మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సతీష్‌కుమార్ విచారణ జరిపారు. మృతదేహానికి కీల్పాక్ వైద్యకళాశాల మాజీ డీన్ డాక్టర్ సెల్వకుమార్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించాలని, దానిని వీడియో తీయాలని ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, ఆదివారం ఉదయం ఆస్పత్రి బృందం అప్పగించిన నాగేంద్రన్ మృతదేహాన్ని ఆయన పెద్దకుమారుడు అశ్వద్ధామన్ స్థానిక వ్యాసర్పాడి సత్యమూర్తినగర్‌లోని ఇంటికి తరలించి అంజలి ఘటించిన అనంతరం సాయంత్రం 4 గంటలకు కొడంగైయూర్-ముల్లైనగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు.



అజిత్-షకీనా (ఇన్‌సెట్‌లో రౌడీ నాగేంద్రన్ (ఫైల్‌ఫొటో)



తండ్రి మృతదేహం వద్ద వధువు మెడలో తాళికడుతున్న దృశ్యం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అడయార్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఆ ప్రాంతాల వివరాలిలా వున్నాయి...

అంబత్తూర్: చోళపురం మెయిన్ రోడ్డు, వివేక్ నగర్, నెహ్రూ నగర్, ఇందిరా నగర్, గణపతి నగర్, కృష్ణాపురం ఎక్స్‌టెన్షన్, మాంతోపు ఏరియా, హాస్పిటల్ రోడ్డు, అర్జున నగర్, ఎంటీహెచ్ రోడ్డు

అలమాది: వానియన్‌సత్రం, కంచి కామకోటి నగర్, రామాపురం, కల్లికుప్పం, కన్నిగపురం, పుదుకుప్పం

పల్లావరం వెస్ట్: చావిడి వీధి, ఐహెచ్ఎఫ్‌డీ కాలని, జీఎస్‌టీ రోడ్డు పల్లావరం బస్టాండ్, పాండ్స్ బ్రిడ్జి, అరుంధతిపురం, వళ్లువర్ పేట, రంగనాధన్ వీధి, ఐజీ రోడ్డు సిగ్నల్

తిరుముల్లైవాయల్: పద్మావతి నగర్, తెండ్రల్ నగర్, మూర్తి నగర్, వెంకటేశ్వర స్కూలు వీధి, వళ్లలార్ నగర్, ముల్లై నగర్. ఆయా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

పాఠశాల వంట గదిలో చోరీ: ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల వంట గదిలోని వస్తువులు చోరీ చేసిన వ్యవహారంలో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. రాయపేట బేగం వీధిలోని ఉన్న చెన్నై మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహబ్బార్ రెహ్మాణి ఐస్‌హౌస్ పోలీస్ స్టేషన్‌లో అందజేసిన ఫిర్యాదులో... త్రైమాసిక సెలవుల అనంతరం ఈ నెల 6వ తేది పాఠశాలలు ప్రారంభమయ్యాయని, ఆ రోజు పాఠశాలకు వెళ్లి చూడగా, వంట గదిలో మిక్సీ, గ్రైండర్, మూడు అల్యూమినియం పాత్రలు, సహా పలు వస్తువులు కనిపించలేదని ఫిర్యాదులో తెలిపారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు, రాయపేట చెల్లమ్మాళ్ గార్డెన్‌కు చెందిన విఘ్నేష్ (25), ముత్తయ్య గార్డెన్‌కు చెందిన వసంత్ కుమార్‌లను శనివారం అరెస్ట్ చేసి దొంగిలించిన వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే విఘ్నేష్‌పై 5, వసంత్‌కుమార్‌పై ఒక చోరీ కేసులున్నాయని పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన ఇద్దరికి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

లైసెన్స్ లేకుండా టపాసుల విక్రయం కేసులో..

ప్యారీస్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ పురస్కరించుకుని లైసెన్సు లేకుండా ఇంటి ప్రాంగణాల్లో టపాసులు విక్రయించిన ఇద్దరిని అరెస్ట్ చేసిన తిరువారూర్ పోలీసులు వారి నుంచి రూ.1.70 లక్షల విలువైన బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 20న దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయాలకు అగ్నిమాపకశాఖ, పోలీసుశాఖలు నిబంధనలు కఠిన తరం చేశాయి. లైసెన్స్ లేకుండా టపాసులు విక్రయించే వారిపై చర్యలుంటాయి హెచ్చరించారు. అయినా తిరువారూర్ పవిత్ర మాణిక్యం గ్రామంలోని ఓ ఇంట్లో భారీస్థాయిలో బాణసంచా నిల్వచేసి విక్రయిస్తున్నట్లు వీఏవో దుర్గారాణికి సమాచారం తెలిసింది. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరువారూర్ పోలీసులు ఆదివారం ఉదయం ఆ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేసి పాండియన్ (55), ఇళంగో (56)లను అరెస్ట్ చేశారు. వారి నుంచి టపాసులను స్వాధీనం చేసుకుని కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

భూ కబ్జాకు పాల్పడిన బీజేపీ నేత అరెస్ట్

చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మదురైలో భూకబ్జాకు పాల్పడిన బీజేపీ నేతను పోలీసులు అరెస్ట్ చేశారు. మదురై అత్తికుళం ప్రాంతానికి చెందిన సంతోష్ రాజ్‌కుమార్-రత్నమాల దంపతులు 2005 నుంచి లండన్‌లో నివసిస్తున్నారు. ఈ దంపతులకు నిలయూర్ బేతేల్ నగర్‌లో ఎకరా 30 సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలం పక్కనే బీజేపీ వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి కుమరేశన్ పాత ఇనుప సామగ్రి దుకాణం నిర్వహిస్తున్నాడు. సంతోష్ రాజ్‌కుమార్ కొద్దికాలం క్రితం మృతిచెందడంతో, భార్య రత్నమాల, బంధువుతో కలిసి మదురై వచ్చారు. ఆ సమయంలో నకిలీ పత్రాలతో కుమరేశన్ తమ స్థలం కబ్జా చేసినట్లు వారు గుర్తించారు. కానీ వారు లండన్ వెళ్లాల్సి ఉండడంతో, స్థలంపై పవర్ ఆఫ్ అటార్నీగా బంధువు సహాయరాజ్‌ను నియమించారు. స్థలం విషయమై సహాయరాజ్‌ను కుమరేశన్ బెదిరించడంతో, అతను కోర్టులో పిటిషన్ వేశారు. విచారించిన కోర్టు, స్థలం సహాయరాజ్‌కు అప్పగించాలని ఉత్తర్వులు జారీచేసింది. కానీ, కుమరేశన్ స్థలం అప్పగించకపోవడంతో, సహాయరాజ్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశారు.

టమోటా ధరలు పతనం

● రోడ్డుపై పారబోస్తున్న రైతులు




చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు గణనీయంగా తగ్గడంతో, రైతులు టమోటాలను రోడ్డు పక్కన పారబోసి నిరాశగా ఇంటి ముఖం పడుతున్నారు. తిరుప్పూర్ జిల్లా ఉడుమలై మడత్తుకుళం, కుడిమంగళం, చుట్టుపక్కల ప్రాంతాల్లో అధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్న టమోటాను రైతులు, ఒట్టన్‌సత్రం, మదురై, దిండుగల్ సహా పలు జిల్లాలకు విక్రయిస్తుంటారు. కొంతకాలంగా 25 కిలోల టమోటా పెట్టె మంచి ధర పలికిన నేపథ్యంలో, ప్రస్తుతం రూ.220కి విక్రయమవుతోంది. ఎకరాకు సుమారు 50 వేలు పెట్టుబడి పెట్టి సాగుచేశామని, ప్రస్తుత ధరకు విక్రయిస్తే రవాణా ఖర్చులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన టమోటా ఇంటికి తీసుకెళ్తే దెబ్బతింటుందని భావించిన రైతులు, రోడ్డు పక్కనే ఎడేసి నిరాశగా ఇళ్లకు పయనమవుతున్నారు.

చికెన్ తిని డ్రైవర్ మృతి

చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): చికెన్ తిన్న డ్రైవర్ స్పృహతప్పి మృతిచెందిన ఘటన చెంగల్పట్టు జిల్లాలో విషాదానికి దారితీసింది. వెంకటమంగళం ప్రాంతానికి చెందిన అరుళ్ (53) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మదురైపాక్కం ప్రాంతానికి చెందిన సంపత్‌కుమార్ వద్ద అరుళ్ పార్ట్‌టైం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంపత్‌కుమార్‌తో కలసి శనివారం విల్లుపురం జిల్లా చిట్టాంపూండికి అరుళ్ వచ్చాడు. ఆ గ్రామంలో సంపత్‌కుమార్ కులదేవత ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. అక్కడే వారు చికెన్ వండుకుని తిన్నట్లు సమాచారం. కొద్ది సేపట్లోనే అరుళ్ స్పృహతప్పి పడిపోవడంతో సంపత్‌కుమార్ 108 అంబులెన్స్‌లో ముండియంబాక్కం ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.30 లక్షలు పలికిన గాంగేయం ఎద్దు

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉడుమలై సమీపంలో గాంగేయం జాతి నెమలి ఎద్దు రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.30 లక్షలకు విక్రయమైంది. తిరుప్పూర్ జిల్లా మరుళ్‌పట్టి గ్రామానికి చెందిన రైతు హరివీరరాఘవన్ ఎద్దులను పెంచుతూ రెక్లా పోటీలకు హాజరవుతుంటాడు. కొద్దిరోజుల క్రితం పొల్లాచ్చి సమీపంలో జరిగిన రెక్లా పోటీల్లో తక్కువ సమయంలో లక్ష్యాన్ని అధికమించి గాంగేయం జాతికి చెందిన నెమలి ఎద్దును మొదటి బహుమతిగా అందుకున్నాడు. ఈ ఎద్దు ప్రస్తుతం అధ్యధికంగా రూ.30 లక్షల 2 వేలకు విక్రయమైంది. కొన్నేళ్ల క్రితం కేరళ రెక్లా పోటీల్లో గెలిచిన ఎద్దు అత్యధికంగా రూ.20 లక్షలకు విక్రయమైన నేపథ్యంలో, ప్రస్తుతం ఉడుమలై ఎద్దు అత్యధిక ధరకు విక్రయమైంది. నేగమం చెట్టికాపాళయంకు చెందిన రైతు రాజా ఈ ఎద్దును కొనుగోలు చేశాడు. రెక్లా పోటీ చరిత్రలో, అత్యధిక ధరకు విక్రయమైన ఎద్దుగా ఉడుమలై ఎద్దు నిలిచిందని ఆ ప్రాంత రైతులు తెలిపారు.



అధిక ధరకు విక్రయమైన గాంగేయం జాతి నెమలి ఎద్దు

విద్యార్థినిపై లైంగిక వేధింపులు కండక్టర్ అరెస్ట్

చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రభుత్వ బస్సు కండక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తంజావూరు జిల్లా ఒరత్తనాడులో ఓ ప్రాంతానికి చెందిన బాలిక ప్లస్ వన్ చదువుతోంది. విద్యార్థిని శనివారం పరీక్ష రాసేందుకు ఒరత్తనాడు నుండి ప్రభుత్వ బస్సులో బయల్దేరింది. బస్సు కండక్టర్ సుధాకర్ (47) విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయమై బాలిక ఫిర్యాదుతో ఒరత్తనాడు మహిళా పోలీసులు కేసు నమోదుచేసి, కండక్టర్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

ఒరిజినల్ మార్కుల జాబితాకు తుది అవకాశం

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎవరూ కోరని సుమారు రెండు లక్షల మార్కుల సర్టిఫికెట్లు దగ్ధం చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రభుత్వ పరీక్ష శాఖ, 2014 నుంచి 2018 వరకు నిర్వహించిన ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాసిన ప్రైవేటు అభ్యర్థులు సుమారు 2.08 లక్షల మంది ఒరిజినల్ మార్కుల సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. ఈ కారణంగా ఆ మార్కుల సర్టిఫికెట్లు తొలగించాలని నిర్ణయించారు. ఈ విషయమై ప్రభుత్వ పరీక్ష శాఖ నిర్వహణ డైరెక్టర్ శశికళ విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ పరీక్ష శాఖ ఆధ్వర్యంలో 2014 నుంచి 2018 సెప్టెంబరు వరకు నిర్వహించిన ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు, సప్లిమెంటరీ పరీక్షలు రాసిన ప్రైవేటు అభ్యర్థులు ఒరిజినల్ మార్కుల జాబితా తీసుకోలేదన్నారు. వాటిని తొలగించాలని నిర్ణయించామన్నారు. అదే సమయంలో, 2026 జనవరి 10వ తేది వరకు చివరి అవకాశం అందిస్తున్నట్లు, నిర్ణీత గడువులోపు అభ్యర్థులు పరీక్ష శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు దరఖాస్తు చేసి ఒరిజినల్ మార్కుల జాబితా పొందాలని సూచించారు.

9.50 లక్షల యూనిట్ల రక్తం సేకరణ

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 9.50 లక్షల యూనిట్ల రక్తం సేకరించినట్లు ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. నగరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... రక్తదానంలో దేశానికే తమిళనాడు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 101 ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లు, 25 ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌లున్నాయన్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 415 రక్తం నిల్వ కేంద్రాలున్నాయన్నారు. అలాగే, అధునాతన పరికరాలతో 32 సంచార రక్త సేకరణ వాహనాలు పనిచేస్తున్నాయని తెలిపారు. 2024-25 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు రక్తదాన శిబిరాల ద్వారా 9.50 లక్షల యూనిట్లు రక్తం సేకరించామన్నారు. ఢిల్లీలోని ప్రజారోగ్య మంత్రిత్వ శాఖ 2024-25వ సంవత్సరంలో ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌ల ద్వారా 4.50 లక్షల యూనిట్లు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ఆ ప్రకారం, లైసెన్స్ పొందిన ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌ల ఆధ్వర్యంలో 4,354 శిబిరాలు నిర్వహించి 4.53 లక్షల యూనిట్ల రక్తం సేకరించి 101 శాతం లక్ష్యం అధికమించినట్లు మంత్రి తెలిపారు.

మృతుల పేరుతో చౌకబారు రాజకీయాలు

● టీవీకేపై ఆర్ఎస్ భారతి ఆగ్రహం

చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మృతిచెందిన వారితో తమిళగ వెట్రి కళగం (టీవీకే) చౌకబారు రాజకీయాలు చేస్తుందని డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో... కరూర్‌లో టీవీకే సభ తొక్కిసలాట వ్యవహారం సీబీఐ విచారణ కోరుతూ సుప్రీంకోర్టులో దాఖలుచేసిన పిటిషన్లతో వాస్తవాలు ప్రస్తుతం వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఈ చర్య దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును తప్పుదారి పట్టించే ప్రయత్నంగా ఉందన్నారు. మృతుడు, అతని ప్రతినిధి కాని వ్యక్తి పేరుతో పిటిషన్ దాఖలుచేసినట్లు తెలుస్తుందన్నారు. అలాగే, పూర్తిగా అర్థం చేసుకోని పత్రాలపై ఎవరో సంతకాలు చేసినట్లు కనిపిస్తుందన్నారు. ఇది న్యాయ ప్రక్రియను తారుమారు చేయడానికి ఉద్దేశించిన ప్రణాళికబద్ధమైన రాజకీయ చర్యగా ఉందని ఆర్ఎస్ భారతి వ్యాఖ్యానించారు.

పోస్టులు 1996.. అభ్యర్థులు 2.36 లక్షలు ప్రశాంతంగా పీజీ గ్రేడ్ టీచర్ పరీక్ష

అడయార్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1996 పీజీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా, వీటి భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్షకు రికార్డు స్థాయిలో 2.36 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఎపుడో పూర్తి చేయాల్సిన ఈ రాత పరీక్షకు న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ఎట్టకేలకు అవన్నీ తొలగిపోవడంతో ఆదివారం ఈ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా 809 కేంద్రాల్లో నిర్వహించారు. పీజీ గ్రేడ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గ్రేడ్-1, కంప్యూటర్ ట్రైనర్ గ్రేడ్-1 తదితర విభాగాల పోస్టులకు ఈ రాత పరీక్షను నిర్వహించారు.

పోలీస్ స్టేషన్, చెక్‌పోస్టులపై పెట్రోల్ బాంబు దాడి

అడయార్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి తచ్చానల్లూర్ పోలీస్ స్టేషన్ సమీపం, చెక్ పోస్ట్‌పై పెట్రోల్ బాంబులు విసిరిన ఘటన కలకలం రేపింది. బైక్‌లో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు తచ్చానల్లూర్‌లోని పోలీస్ స్టేషన్ ఎంట్రన్స్‌లో పెట్రోల్ బాంబు వేసి పరారయ్యారు. అలాగే, తాళయుత్తు చెక్ పోస్ట్‌పై కూడా గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబు వేసి పరారయ్యారు. ఈ ఘటనలపై విచారణ చేపట్టిన పోలీసులు, ఆయా ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీ పరిశీలించగా, పోలీస్‌స్టేషన్, చెక్‌పోస్టులపై పెట్రోల్ బాంబు వేసింది ఒకే వ్యక్తి అని గుర్తించి అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

రేషన్ దుకాణాలకు రూ.300 కోట్ల సబ్సిడీ

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలకు 2025-26వ ఆర్థిక సంవత్సరానికి రూ.300 కోట్లు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సహకార రంగం ఆధ్వర్యంలో 33వేల రేషన్ దుకాణాలున్నాయి. రేషన్ దుకాణాల అద్దె, విద్యుత్ బిల్లులు, ఉద్యోగుల వేతనాలు వంటి వాటిని ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. ఆ ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.300 కోట్ల సబ్సిడీ కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

అన్నాడీఎంకే బూత్ కమిటీకి 'ఆన్‌లైన్' శిక్షణ

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బూత్ కమిటీ నిర్వాహకులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విడుదల చేసిన ప్రకటనలో... శాసనసభ ఎన్నికల సందర్భంగా, ఒక్కో నియోజకవర్గ పరిధిలో కార్పొరేషన్, మున్సిపాలిటీ, పట్టణ పంచాయతి, పంచాయతీ యూనియన్, గ్రామ పంచాయతీల్లో బూత్ కమిటీల ఏర్పాటుకు జిల్లాల వారీగా పర్యవేక్షకులను నియమించామని తెలిపారు. బూత్ కమిటీ నిర్వాహకులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చేలా ఐటీ అధికారులను నియమించామని పళనిస్వామి తెలిపారు.

న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు.. టీవీకే దిండుగల్ జిల్లా కార్యదర్శి అరెస్ట్



విజయ్‌తో నిర్మల్ కుమార్

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) దిండుగల్ సౌత్ జిల్లా కార్యదర్శి నిర్మల్‌కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కరూర్ వేలుచామిపురంలో గత నెల 27న జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందారు. ఈ ఘటనపై కరూర్ టౌన్ పోలీసులు, టీవీకే కరూర్ వెస్ట్ జిల్లా కార్యదర్శి మదియళగన్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిర్మల్ కుమార్ సహా పలువురిపై కేసు నమోదు చేసారు. వారిలో దిండుగల్ జిల్లా కుజిలియంపారై సమీపం ఓ గ్రామంలో బంధువుల ఇంట్లో దాగిన మదియళగన్‌ను ప్రత్యేక విభాగం పోలీసులు గత నెల 29న అరెస్ట్ చేశారు. అలాగే మదియళగన్‌కు ఆశ్రయం కల్పించిన కరూర్ నగర ఇన్‌ఛార్జి మాసి అలియాస్ పౌన్‌రాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ఈ కేసును ఇటీవల విచారించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి, టీవీకే అధ్యక్షుడు విజయ్ తీరును ఖండించారు. ఈ కేసు విచారించిన న్యాయమూర్తిపై సామాజిక మాధ్యమాల్లో పలువురు విమర్శలు చేస్తూ పోస్ట్ చేశారు. న్యాయమూర్తి గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా పోస్ట్ చేసిన దిండుగల్ సౌత్ జిల్లా టీవీకే కార్యదర్శి ఎస్ఎం.నిర్మల్‌కుమార్‌ను సానార్‌పట్టి పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

తల్లిపాలు తాగుతూ శ్వాస ఆగి పసికందు మృతి

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పసికందు తల్లిపాలు తాగుతూ శ్వాస తీసుకోలేక మృతిచెందిన ఘటన తిరువళ్లూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పట్టాభిరాం అంబేడ్కర్ నగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్-బ్రేసి దంపతులకు ఏడాది క్రితం వివాహమైంది. మూడు రోజుల క్రితం పోరూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బ్రేసి మగబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటికెళ్లిన బ్రేసి, బిడ్డకు పాలు ఇచ్చింది. పాలు తాగుతున్న బిడ్డ ఒక్కసారిగా శ్వాస తీసుకోలేక ఇబ్బందులు పడుతూ స్పృహ తప్పింది. తల్లిదండ్రులు వెంటనే బిడ్డను ఆవడి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే బిడ్డ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పట్టాభిరామ్ పోలీసులు, పసికందు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హెల్మెట్ ఉన్న వారికి అరటి పండుతో అభినందన



హెల్మెట్ ధరించిన వాహనచోదకులకు అరటి పండు ఇస్తున్న ఎస్పీ రాజారామ్

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు అరటి పండు ఇచ్చి అభినందించారు. తంజావూరులో, వినియోగదారుల భద్రతా కేంద్రం, ట్రాఫిక్ పోలీసులు, ప్రైవేటు ఆస్పత్రులు సంయుక్తంగా, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజారామ్ హాజరై హెల్మెట్ లేని వాహనచోదకులను ఆపి, వారికి హెల్మెట్ అందజేసి, హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే, హెల్మెట్ ధరించి వచ్చిన 50 మందికి తిరువయ్యారు అరటి రైతు మదియళగన్ ద్వారా, ఒక అరటి పండు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజారామ్ మాట్లాడుతూ... హెల్మెట్‌ధారణ అత్యంత అవసరమని, అది మీకు, మీ కుటుంబానికి భద్రత ఇస్తుందన్నారు. ఈ ప్రచారానికి రెండు టన్నుల అరటి పండ్లు ఇచ్చిన రైతు మదియళగన్‌కు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ రాకెట్ ప్రయోగించిన విద్యార్థులు



నీటి సీసాలో గాలి నింపుతున్న విద్యార్థులు

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టిలోని ప్రభుత్వ బాలికల మహోన్నత విద్యార్థులు మోడల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించారు. అంతర్జాతీయ అంతరిక్ష వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం విద్యార్థులు ఈ ప్రయోగం నిర్వహించారు. ఒక సీసాలో పావు వంతు నీటిని నింపి, గాలిని పంప్ చేసి, మూసేసి, మోడల్ రాకెట్ ఆకాశంలోకి పంపారు. విద్యార్థులే స్వయంగా ఈ మోడల్ రాకెట్ రూపొందించారని సైన్స్ ఉపాధ్యాయులు క్రీనా, కమలా రాణి తెలిపారు. విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

డీఎండీకే కార్యాలయం, టి.రాజేందర్ ఇంటికి బాంబు బెదిరింపు

అడయార్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులోని డీఎండీకే కార్యాలయానికి ఆదివారం బాంబు బెదిరింపు వచ్చింది. పోలీస్ కమిషనర్ కార్యాలయం కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసిన అపరిచిత వ్యక్తి, డీఎండీకే కార్యాలయంలో బాంబుందని చెప్పి ఫోన్ కట్ చేశారు. ఈ విషయాన్ని కంట్రోల్ రూమ్ అధికారులు బాంబ్ స్క్వాడ్‌కు తెలియజేశారు. డాగ్‌స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న సిబ్బంది, కార్యాలయం, పరిసరాలను తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ వ్యవహారంపై, ఫోన్ కాల్ వచ్చిన నెంబరు ఆధారంగా అపరిచిత వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

స్థానిక టి.నగర్‌లోని నటుడు, దర్శకుడు టి.రాజేందర్ ఇంటికి కూడా బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో, పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకుని పరిశీలించి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు పుదుచ్చేరి వర్శిటీ ప్రొఫెసర్ సస్పెన్షన్

పుదుచ్చేరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన పుదుచ్చేరి వర్శిటీ ప్రొఫెసర్‌పై సస్పెన్షన్ వేటుపడింది. మాధవయ్య అనే ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని, దీనిపై చర్యలు తీసుకోవాలని యూనివర్శిటీ కారైక్కాల్ శాఖలో చదువుకుంటున్న ఓ విద్యార్థిని వర్శిటీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. దీంతో విద్యార్థులు వీసీ ప్రకాష్‌బాబును చుట్టుముట్టి ఈ నెల 9వ తేదీ ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఆందోళన చేశారు. పోలీసులు లాఠీచార్జి నిర్వహించి 24 మంది విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పుదుచ్చేరిలోని రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. దీనితో మాధవయ్యన్ అనే ప్రొఫెసర్‌ను వర్శిటీ కారైక్కాల్ ప్రాంగణం చైర్మెన్ బాధ్యతల నుండి తొలగిస్తూ ఆయన స్థానంలో తరణిక్కరసును వర్శిటీ నియమించింది.

టాస్మాక్ దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు

అడయార్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాల్లో (టాస్మాక్) త్వరలోనే డిజిటల్ చెల్లింపుల (క్యూఆర్ కోడ్) విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ప్రస్తుతం కొన్ని రకాల మద్యం బాటిళ్ల ధరకే క్యూఆర్ కోడ్ చెల్లింపులు అమలు చేస్తున్నారు. మిగిలిన బ్రాండ్ల ధరలకు అదనంగా ప్రతి మద్యం బాటిల్‌పై రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటికి చెక్ పెట్టేలా క్యూఆర్ కోడ్ విధానంలో చెల్లింపులు జరిపేలా టాస్మాక్ అధికారులు చర్యలు చేపట్టారు.



ప్రియాంక అరుల్ మోహన్

ప్రియాంకను టార్గెట్ చేసిన మాజీ మేనేజర్?

తమిళ, తెలుగు భాషల్లో వరుస చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్న హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్‌ను ఆమె మాజీ మేనేజర్ టార్గెట్ చేశారంటూ ప్రచారం సాగుతోంది. ఒక అగ్ర నటుడి మేనేజర్ ప్రియాంక కూడా మేనేజరుగా ఉండేవారు. కొన్ని రోజులకు వారి మధ్య వచ్చిన మనస్పర్థల కారణంగా ఆ మేనేజర్‌ను ప్రియాంక దూరం పెట్టారు. అప్పటి నుంచి ప్రియాంకపై కక్ష కట్టిన మాజీ మేనేజర్.. ఆమె ఫొటోలను ఏఐ టెక్నాలజీ ద్వారా అసభ్యంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయిస్తున్నారనే ఆరోపణ లున్నాయి. ఈ ఫొటోలను చూసిన పలువురు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. వీటిపై ప్రియాంక మోహన్ స్పందిస్తూ, 'కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా సృష్టించిన అసభ్యకరమైన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇలాంటి ఫొటోలను క్రియేట్ చేయడం, వాటిని సోషల్ మీడియాలో షేర్ చేయడం ఆపండి. ఇలాంటి పనులకు దూరంగా ఉండాలి. మీరు ఏం క్రియేట్ చేస్తున్నారో ఒక సారి తెలుసుకుని, వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయండి' అని కోరారు.

శింబు సరసన ముగ్గురు హీరోయిన్లు?

చిత్రజ్యోతి

కోలీవుడ్ మోస్ట్ బ్యాచిలర్ హీరో సిలంబరసన్ టీఆర్ అలియాస్ శింబు తన కొత్త చిత్రంలో గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటిస్తుండగా, ఇందులో ఆయన సరసన ముగ్గురు హీరోయిన్లు నటించనున్నట్టు సమాచారం. ఈ మూవీ ఉత్తర చెన్నై నేపథ్యంలో తెరకెక్కనుంది. జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వం వహించే ఈ చిత్రానికి 'అరసన్' అనే టైటిల్ ఖరారు చేశారు. త్వరలోనే సెట్స్ పైకి వెళ్ళనున్న ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారు. వారిలో సమంత, కీర్తి సురేష్ పేర్లను ఖరారు చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. మరో హీరోయిన్‌గా సాయిపల్లవిని తీసుకునేందుకు సంప్రదిస్తున్నారు. శింబుతో సాయిపల్లవి నటించేందుకు అంగీకరిస్తే 'అరసన్' మూవీలో శింబు సరసన ముగ్గురు ప్రముఖ హీరోయిన్లు నటిస్తారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత ఐసరి కె.గణేష్ నిర్మించనున్నారు.



శింబు, కీర్తి, సాయిపల్లవి, సమంత

'కాట్టాలన్'లో భయ పెట్టే ఆంటోనీవర్గీస్


క్యూబ్స్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై షరీఫ్ మహ్మద్ నిర్మిస్తోన్న యాక్షన్ థ్రిల్లర్ 'కాట్టాలన్' మూవీలో ప్రధాన పాత్ర పోషించిన ఆంటోనీ వర్గీస్ మాస్‌లుక్ తాజాగా రిలీజ్ చేశారు. ఇది ప్రేక్షకులను భయపెట్టేలావుంది. అందులో ఆంటోనీ భయంకరంగా కనిపిస్తున్నారు. నిప్పుకణికల్లాంటి కళ్ళు, చెల్లాచెదురైన ఎర్రటి జుట్టు, స్టైల్‌గా సిగరెట్ తాగుతూ, ముఖంపై రక్తం కారుతూ మాస్ అవతార్‌లా కనిపిస్తున్నారు. పాల్ జార్జ్ దర్శకత్వంలో పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ మూవీగా తమిళం, మలయాళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'ఈ సినిమా షూటింగ్ ఎంతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. పాన్ ఇండియా గ్రాండియర్ కాన్సెప్టుతో భారీ హంగులతో రూపొందిస్తున్నారు. ఇందులోని యాక్షన్ సన్నివేశాలను ఓంగ్-బక్ సిరీస్‌కు యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించిన యాక్షన్ స్టంట్ మాస్టర్ కేజా కంపక్డీ బృందం ఆధ్వర్యంలో థాయ్‌లాండ్‌లో చిత్రీకరించారు. సినిమాలోని కీలక పాత్రల్లో సునీల్, కబీర్ దుహాన్ సింగ్, పార్థ్ తివారీ, జగదీష్, సిద్ధిక్, హసన్ షా తదితరులు నటించారు. నిర్మాణాంతర కార్యక్రమాలను పూర్తిచేసి త్వరలోనే విడుదల చేస్తాం' అని పేర్కొన్నారు.



'కాట్టాలన్'లో ఆంటోనీ వర్గీస్

పాన్ ఇండియా కాన్సెప్టుపై నమ్మకం లేదు: వివి

తనకు పాన్ ఇండియా మూవీ కాన్సెప్టుపై నమ్మకం లేదని హీరో విష్ణు విశాల్ (వివి) అన్నారు. తమిళ చిత్రపరిశ్రమలో వైవిధ్య భరితమైన కథాపాత్రలను ఎంచుకుని వివి తన కెరీర్ కొనసాగిస్తూ, అనేక హిట్స్ తన ఖాతాలో వేసుకుంటున్నారు. 'గట్టాకుస్తీ' సినిమా తర్వాత వివి నటించిన 'ఆర్యన్' విడుదలకు సిద్ధమైంది. 'రాచ్చసన్' తరహాలో హర్రర్ థ్రిల్లర్ మూవీగా 'ఆర్యన్'ను తెరకెక్కించారు. ఈ చిత్ర విశేషాలను తాజాగా వివి వివరిస్తూ, కొవిడ్ సమయంలో ఈ చిత్రం కథ విన్నాను. అందులో నటించాలనే ఆసక్తి కలిగింది. 'రాచ్చసన్' సినిమా తర్వాత హర్రర్ థ్రిల్లర్ మూవీలో నటించాలని, అది గత చిత్రాలకు భిన్నంగా ఉండాలని భావించాను. అందుకు తగినట్టుగానే 'ఆర్యన్' ఉంది. 'గట్టాకుస్తీ' సినిమా ప్రారంభానికి ముందే 'ఆర్యన్' షూటింగ్ ప్రారంభించి 15 రోజుల పాటు చేశాం. అయితే పలు కారణాలతో షూటింగ్ ఆగిపోయింది. ఈ సినిమా హిందీ వెర్షన్‌లో విలన్ పాత్రలో నటించేందుకు బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ ఆసక్తి చూపించారు. కానీ, దానికి అవకాశం లేకుండా పోయింది. నాకు పాన్ ఇండియా మూవీ కాన్సెప్టుపై పెద్ద ఆసక్తి లేదు. అందుకే నా చిత్రాలన్నీ తమిళం, తెలుగు భాషలకే పరిమితం' అని వివరించారు.



విష్ణు విశాల్





పర్యాటకుల కోసం మినీ రైలు - ఆకర్షణీయంగా పురివిప్పిన నెమలి బొమ్మ






పార్కు లోపలి భాగం




పర్యాటకుల కోసం ప్రత్యేకం



ప్రపంచ ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతం

- మహాబలిపురంలో అధునాతన పార్క్
- పుష్పాలు, సీతకోకచిలుకలు
- ఆహ్లాదపరిచే ఫౌంటెన్లు, విద్యుద్దీపకాంతులు
- వాటర్ పార్కులు.. ఆహార దుకాణాలు





మిరిమిట్లుగొలిపే మిణుగురు పురుగులు కాదు సుమా!.. ఎల్ఈడీ కాంతుల జిలుగులు

చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధి చెందిన చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం ఖ్యాతి పెంచేలా మరో అందమైన పార్కు రూపుదిద్దుకుంటోంది. ఎటు చూసినా రకరకాల పుష్పాలు, రంగురంగుల సీతాకోక చిలుకలు, ఆహ్లాదపరిచే ఫౌంటెన్లు, మిరిమిట్లు గొలిపే విద్యుద్దీపకాంతులు, సెల్ఫీ కేంద్రాలతో పర్యాటకులను ఇట్టే ఆకట్టుకునేలా సిద్ధమవుతోంది. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న ఈ పార్కు ప్రారంభోత్సవానికి పరుగులు పెడుతోంది. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి కాగా, వచ్చే నెలలో దీనిని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. మహాబలిపురంలోని పాత శిల్ప కళాశాల రోడ్డులో 2.47 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రకాశవంతమైన పార్కు నిర్మితమవుతోంది. మహాబలిపురం, మామల్లాపురంగా పిలవబడుతున్న ఈ ప్రాంతం పల్లవుల కాలం నాటి శిల్పాలకు అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. అంతేగాక యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగానూ గుర్తింపు పొందిన ఈ ప్రాంతాన్ని వీక్షించేందుకు, ఇక్కడి చరిత్ర తెలుసుకునేందుకు దేశ విదేశాల నుంచి రోజూ వేలాదిమంది పర్యాటకులు వస్తుంటారు. 24 గంటలూ పర్యాటకులతో సందడిగా వుండే ఈ ప్రాంతానికి మరింత వన్నె తీసుకురావాలని పర్యాటక శాఖ సంకల్పించింది. ఇందులో భాగంగా సుమారు రూ.10 కోట్లతో అధునాతన పార్కు నిర్మిస్తోంది. జంతువులు, సీతాకోక చిలుకలు, పుష్పాలతో కళకళలాడే ఈ పార్కుకు మరింత శోభతెచ్చేలా మిలియన్ విద్యుద్దీపాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక సెల్ఫీ కేంద్రాలు, కృత్రిమ ఫౌంటెన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. మినీ 3డీ, 5డీ సినిమా థియేటర్లు, వాటర్ పార్కులు కూడా సిద్ధమవుతున్నాయి. ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో వివిధ ఆహార దుకాణాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. దీనిపై అధికారులు మాట్లాడుతూ.. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని, త్వరలోనే పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



విద్యుత్ కాంతుల్లో జింకలు



త్రీడీ పెయింటింగ్స్





తిరుచెందూర్ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్యారీస్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు సెలవురోజులైన శని,ఆదివారాలు పర్యాటకులు, భక్తులతో కిటకిటలాడాయి. తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజు భక్తులు పెద్దసంఖ్య వస్తుంటారు. శనివారం నుంచి అధిక సంఖ్యలో వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆలయ సిబ్బంది క్యూలైన్లు ఏర్పాటు చేసి వసతులు కల్పించారు.. తెల్లవారుజామున 4 గంటలకే ఆలయం తెరిచి, విశ్వరూదీపారాధన, ఉదయం 6 గంటల ఉదయమార్తాండాభిషేకం, దీపారాధన ఇతర పూజలను శివాచార్యులు నిర్వహించారు. భక్తులు తిరుచెందూర్ సముద్రం, ఆలయ ప్రాంగణాల్లోని బావుల్లో పుణ్యస్నానాలు ఆచరించి సుమారు 4 గంటల పాటు క్యూలైన్లలో వేచివుండి స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

'జోస్ అలుక్కాస్' చైర్మన్ ఆత్మకథ 'గోల్డ్' ఆవిష్కరణ



'గోల్డ్' పుస్తకావిష్కరణ దృశ్యం

చెన్నై, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల రంగంలో ప్రసిద్ధి చెందిన 'జోస్ అలుక్కాస్' గ్రూపు చైర్మన్ జోస్ అలుక్కాస్ ఆత్మకథ 'గోల్డ్' తమిళ వెర్షన్‌ను సంస్థ అంబాసిడర్, ప్రముఖ సినీ నటుడు ఆర్.మాధవన్ ఆవిష్కరించారు. కోయంబత్తూరులో శనివారం జరిగిన కార్యక్రమంలో గోల్డ్ పుస్తకాన్ని ఆవిష్కరించిన మాధవన్ మాట్లాడుతూ.. ఈ ఆవిష్కరణ క్షణం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ఈ పుస్తకం జోస్ అలుక్కాస్ అసాధారణ ప్రయాణాన్ని, వారసత్వాన్ని రూపొందించిన విలువలను సంగ్రహిస్తుందని, అయన కృషి, దార్శనికత, కలలు కనే ధైర్యాన్ని నమ్మే భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తుందని వివరించారు. జోస్ అలుక్కాస్ మాట్లాడుతూ.. తమిళనాడు ఎల్లప్పుడూ తమ వృద్ధి కథకు కేంద్రంగా వుందని, ఇక్కడే తమ బలమైన ఉనికి, అత్యధిక సంఖ్యలో షోరూంలున్నాయని తెలిపారు. తమిళనాడు, ముఖ్యంగా కోయంబత్తూరు ప్రజలు జోస్ అలుక్కాస్ ప్రయాణాన్ని రూపొందించడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించారన్నారు. ఈ సందర్భంగా మాదవన్ కొత్త ఫ్లాగ్‌షిప్ షోరూంను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ అలుక్కాస్, పాల్ అలుక్కాస్, జాన్ అలుక్కాస్, కోయంబత్తూరు ఎంపీ డాక్టర్ గణపతి రాజ్‌కుమార్, కోయంబత్తూరు కార్పొరేషన్ మేయర్ కె.రంగనాయకి, డిప్యూటీ మేయర్ ఆర్.వెట్రిసెల్వన్ తదితరులు పాల్గొన్నారు.

జాలర్ల వలలో చిక్కిన కమ్యూనికేషన్ పరికరం



పరికరం చూపుతున్న జాలరి

పెరంబూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తేంగాపట్టణం సముద్రంలో జాలర్ల వలలో చిక్కిన సముద్ర కమ్యూనికేషన్ పరికరాన్ని మత్స్యశాఖ అధికారులకు అప్పగించారు. కన్నియాకుమారి జిల్లా సైమన్ కాలనీ జాలర్ల గ్రామానికి చెందిన జయశీలన్, కొందరు జాలర్లతో కలసి నాలుగు రోజుల క్రితం చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. తేంగాపట్టణం ప్రాంతంలో వారు చేపలు పడుతుండగా, వారి వలలో నారింజ రంగులో ఉన్న గుండ్రని వస్తువు చిక్కుకుంది. ఈ వస్తువును తీరానికి తీసుకొచ్చిన జాలర్లు, సముద్రతీర భద్రతా దళం అధికారులకు సమాచారం ఇచ్చారు. క్యూ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ అధికారులతో అక్కడకు చేరుకున్న అధికారులు ఆ వస్తువును స్వాధీనం చేసుకున్నారు. అది ఇండియన్ నేషనల్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్‌కు చెందిన కమ్యూనికేషన్ పరికరం 'ట్రిప్టర్ బోయ్'గా గుర్తించారు. సముద్ర ప్రవాహాలు, లవణీయతను కొలవడానికి ఈ పరికరాన్ని సముద్రం మధ్యలో వదులుతుంటారని, ఈ పరికరం జాలర్ల వలలో చిక్కుకుందని అధికారులు తెలిపారు.

దీపావళి పండుగ నేపథ్యంలో 6,630 బాణసంచా దుకాణాలకు అనుమతి

ప్యారీస్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దీపావళి పండుగ కోసం రాష్ట్రం ప్రత్యేక అంశాలతో ముస్తాబవుతోంది. పండుగను పురస్కరించుకుని వస్త్రాలు, టపాసుల విక్రయాలు జోరందుకున్నాయి. తాత్కాలిక బాణసంచా దుకాణాలకు అగ్నిమాపకశాఖ కఠిన నిబంధనలు విధించింది. గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అగ్నిమాపక శాఖ డైరెక్టర్, డీజీపీ సీమా అగర్వాల్ రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపకశాఖ కార్యాలయాలకు నెల రోజుల ముందే సర్క్యులర్ జారీచేశారు. అందులో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు పేలుడు పదార్థాల చట్టాన్ని తప్పనిసరిగా పాటించాలని, దుకాణాల్లో కనీస వసతులు, భద్రతా ఏర్పాట్లను పటిష్టంచేయాలని ఆదేశించారు. తాత్కాలిక టపాసుల దుకాణాలు నడిపించడానికి పోలీసు, అగ్నిమాపకశాఖ అధికారుల నుంచి లైసెన్స్ పొందాల్సి వుంటుంది. ఈ ఏడాది దీపావళిని పురస్కరించుకుని టపాసుల దుకాణాలు ఏర్పాటుకు అనుమతి కోరుతూ అగ్నిమాపక శాఖకు 9,549 దరఖాస్తులు రాగా, వాటిలో తొలివిడతగా 6,630 దరఖాస్తులకు అనుమతులిచ్చారు. మిగతా 2,499 దరఖాస్తులను పరిశీలించి త్వరలో లైసెన్సులు మంజూరు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం ఎక్కువ మంది బాణసంచా దుకాణాలకు అనుమతి కోరుతూ దరఖాస్తు చేయడం గమనార్హం.



సూర్యోదయాన్ని వీక్షిస్తూ పర్యాటకుల పరవశం



అడయార్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి త్రివేణి సంగమం వద్ద పర్యాటకులు సూర్యోదయం దృశ్యాలను వీక్షించి పరవశించిపోయారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతం కన్నియాకుమారికి ప్రతిరోజు పర్యాటకులు, భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారాంతపు రోజులు, పండుగ సెలవుల్లో పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఆదివారం సూర్యోదయం వీక్షించేందుకు తెల్లవారుజాము నుంచే పర్యాటకులు త్రివేణి సంగమం ప్రాంతంలో వేచి ఉన్నారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో సముద్రపు దిగువ నుంచే సూర్యుడు పైకి వచ్చే దృశ్యాలను పర్యాటకులు తన్మయంతో వీక్షించారు. అనంతరం బోటు ద్వారా వివేకానంద రాక్‌కు వెళ్లిన పర్యాటకులు, అక్కడి నుంచి అద్దాల వంతెన ద్వారా తిరువళ్లువర్ విగ్రహాన్ని సందర్శించారు.

కరూర్ ఘటనపై విజయ్‌తో మాట్లాడలేదు | ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట ఘటనపై తాను తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌తో మాట్లాడలేదని, అయినా తన ప్రచారసభలకు టీవీకే కార్యకర్తలు స్వచ్ఛందంగా వస్తున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పేర్కొన్నారు. సేలం జిల్లా పెరియసోరగై ప్రాంతంలో పురాతన సెండ్రాయ పెరుమాళ్ ఆలయాన్ని ఆదివారం ఉదయం ఈపీఎస్ సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో ఎన్నికల ప్రచారవాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం చేకూర్చాలని పెరుమాళ్‌కు పూజలు చేశారు. అక్కడికి వచ్చిన రైతులు, నేతకార్మికులు, వివిధ వృత్తుల వారు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులను ఈపీఎస్ పలకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విజయ్ పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా తన సభలకు వస్తున్నారని, ఇందువల్ల తమ పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపిస్తుందన్నారు. కరూర్ దుర్ఘటనపై తాను విజయ్‌ను ఫోన్‌లో సంప్రదించి మాట్లాడలేదని స్పష్టంచేశారు. డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, డీపీఐ, ఎండీఎంకే, ఎంఎంకే, సీపీఎం, సీపీఐ, ఎంఎన్ఎం తదితర పార్టీలు రాష్ట్రప్రభుత్వ పనితీరు గురించి విమర్శించేందుకు భయపడుతున్నారని, కూటమిలో ఉన్నంత వరకు వారు బానిసల్లాగే ఉంటారని ఆయన ఎద్దేవా చేశారు. అన్నాడీఎంకే అధికారంలోకి రావడాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని ఈపీఎస్ ధీమా వ్యక్తంచేశారు.



సెండ్రాయ పెరుమాళ్ ఆలయంలో ఈపీఎస్ పూజలు